కొనసాగుతున్న వోల్వో డ్రైవర్ల సమ్మె

ఇందారం ఓపెన్‌కాస్టులో నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న వోల్వో డ్రైవర్లు

జైపూర్, ఏప్రిల్ 1: వేతనాలు పెంచాలని ఇందారం ఓపెన్‌కాస్టు వరహా కంపెనీలో పని చేస్తున్న వోల్వో డ్రైవర్లు నాలుగు రోజులుగా విధుల బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఇందారం ఓపెన్ కాస్టు నుంచి ఓబీ (ఓవర్ బర్డెన్ మట్టి)ని తీసేందుకు వరహా కంపెనీ సింగరేణితో ఒప్పందం కుదుర్చుకుని పనులు నిర్వహిస్తున్నది. ఓబీ మట్టిని తీసేందుకు కంపెనీ 120 వోల్వోలను తిప్పుతుండగా షిప్టుకు 60 మంది చొప్పున మూడు షిప్టులకు గాను 250 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. డ్రైవర్లు వేతనాలు పెంచాలని నాలుగురోజులుగా సమ్మె చేస్తుండగా ఓబీ తీయడం మొత్తం నిలిచిపోయింది. వేతనాలు పెంచాలని ఇప్పటికే అనేకమార్లు యాజమాన్యానికి వినతి పత్రం ఇచ్చామని, అయినా స్పందించడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వరహా కంపెనీ వారితో చర్చలు జరిపి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, డ్రైవర్ల దీక్షా శిబిరాన్ని మంగళవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ సందర్శించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని రెండు నెలల సమయం ఇవ్వాలని వారిని కోరారు.

ట్రాఫిక్ హోంగార్డు మానవత్వం

గుంతను పూడుస్తున్న హోంగార్డ్ వెంకటేశ్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర చౌరస్తా దగ్గర్లోని మెయిన్ రోడ్డుపై ఇటీవల ప్రమాదకరంగా గుంత ఏర్పడి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఇది గమనించిన ట్రాఫిక్ హోంగార్డ్ వెంకటేశ్ మంగళవారం గుంతను పూడ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు. సిమెంట్ కంకర తీసుకువచ్చి గుంతలు పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశాడు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ఆయనను అభినందించారు.

షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వినోద్‌జైస్వాల్ కు స్వీటు తినిపిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఏప్రిల్ 1: సేవాలాల్ మందిరం ఎదుట షెడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని రెబ్బెన, సింగల్‌గూడ గ్రామస్తులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా సన్మానించినట్లు రెబ్బెన గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో రెబ్బెన బీఆర్ఎస్ నాయకులు అన్నపూర్ణ మురళీగౌడ్‌తోపాటు గ్రామస్తులు న్నారు. కాగా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి వీరాభిమాని, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వినోద్‌జైస్వాల్ జన్మదిన వేడుకలు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి ఆశీర్వాదం తీసుకున్న అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఓసీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 1: ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీసీసీలోని యూనియన్ ఆఫీస్ వద్ద వారు మాట్లాడుతూ, వేసవిలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, రెస్ట్ హాళ్లను నిర్మించాలన్నారు. ప్రతిఏటా నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తున్నప్పటికీ ఓసీ కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించకపోవడం సరికాదన్నారు. యాజమాన్యం కార్మికులకు ప్లేడేలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నోముల బాలయ్య, దుర్గం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు

పొలాల్లో నీటిని పట్టుకుంటున్న మహిళ

కన్నెపల్లి, ఏప్రిల్ 1 : కన్నెపల్లి మండలంలోని సాలిగాం గ్రామంలో నాలుగు రోజులుగా పంచాయతీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇ బ్బందులు పడుతున్నారు. వాటర్ ట్యాంకు గేట్ వాల్వు చెడిపోవడంతో నీరు సరఫరా కావడం లేదు. దీంతో దూరంలో ఉన్న పొ లాల వద్ద ఉన్న బోరు మోటార్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి రాకేశ్‌ను వివరణ కోరగా రేపటిలోగా గేట్ వాల్వు రిపేరు చేసి నీటిని అందిస్తామని తెలిపారు.

అత్యవసర వైద్యాధికారులను నియమించాలి



దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్యాజువల్ మెడికల్ ఆఫీసర్స్ (సీఎంవో) అత్యవసర వైద్యాధికారులను వెంటనే నియమించాలని మంచిర్యాల మెడికల్ ఫ్యాకల్టీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రత్యేక క్యాజువాలిటీ ఆఫీసర్లు లేకపోవడంతో డీఎంఈ ఆదేశాల మేరకు ప్రత్యేక నిపుణులు, అధ్యాపకులు సాధారణ అత్యవసర వైద్య బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుందన్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేకపోతున్నట్లు తెలిపారు. అత్యవసర విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అధ్యాపకుల పని భారం తగ్గించేందుకు సీఎంవోలను తక్షణమే నియమించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్యాల కోసం సమష్టిగా కృషి చేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 1: బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీకి సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించడం కోసం సమష్టిగా కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో మంగళవారం కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం కార్మికుల సమిష్టి కృషితో లక్ష్యాలు అధిగమించామని, ఇదే స్ఫూర్తితో నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైర్‌గూడ పీఈ వీరన్న, గని మేనేజర్ శంకర్, డీవైపీఎం వేణు, సంక్షేమాధికారి రజినీకుమార్, సేఫ్టీ ఆఫీసర్ నారాయణ, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వరికి ఊస.. రైతుకు అరిగోస

- చేతికొచ్చే దశలో దెబ్బ తింటున్న చేను
- మెడ విరుపు, మొగి పురుగు దాడి
- ఎన్ని మందులు స్ప్రే చేసినా తగ్గని ఉధృతి
- తాలుపోతున్న వరి గొలుసులు
- ఆందోళనలో రైతులు



ఎల్లూరులో వరి కంకులు ఎండిపోయి తెల్లగా మారుతున్న పచ్చని పొలం

వరి పంట వేసిన రైతులకు ఈ ఏడాది అష్టకష్టాలు ఎదురవుతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయానికి మాయదారి రోగాలు సోకి వరి గొలుసు ఊస తిరిగి తాలుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొట్ట దశలో ఈనే సమయంలో గొలుసు తాలుబోతుండడంతో రకరకాల మందులను వేల రూపాయలు పెట్టి తెచ్చి పిచికారీ చేసిన లాభం లేకుండా పోయింది. వరి గింజలు గట్టి పడకుండా తాలుపోవడం, మొగి పురుగు, మెడ విరుపు లాంటి లక్షణాలతో వరి దెబ్బతింటోందని రైతులు దిగాలు చెందుతున్నారు.

పెంచికల్ పేట్, ఏప్రిల్ 1 : మండలంలోని ఎల్లూరు గ్రామంలో బొక్కి వాగు ప్రాజెక్టు దిగువన ప్రాజెక్టు నీరు, బోరు బావులపై ఆధారపడి దాదాపు 200 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రానున్న సమయంలో 40 శాతం పంటలో వరి కంకులు గింజలు తయారు కాకుండా ఎండిపోతూ తెల్లని తెగులు వచ్చి దర్శనమిస్తున్నది. ఎన్ని రకాల పిచికారీ మందులు స్ప్రే చేసినా ఫలితం దక్కలేదు. దీంతో రైతులు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా మీద పడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పరిశీలించి సూచనలు అందిస్తూ అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలేక నష్ట పోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంట సాగు వివరాలు నమోదు సమయంలో సైతం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా పంచాయతీ కార్యాలయాలు రైతు అందుబాటులో లేకుంటే ఫోన్ ద్వారా పంటల వివరాలు నమోదు చేసుకుంటున్నారని రైతులు తెలుపుతున్నారు. పంటలో వరి కంకి ఎండిపోయి నష్టపోతున్న రైతులను ప్రభుత్వం అధికారుల ద్వారా సర్వే చేయించి తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

కాసిపేట, ఏప్రిల్ 1 : కాసిపేట మండల కేంద్రంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జాడి పోచం ఆధ్వర్యంలో కాసిపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా జాడి పోషం, అధ్యక్షుడిగా బండారి సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా ఉప్పులేటి మధునయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి రాజయ్య, సహాయ కార్యదర్శిగా భోగి సత్తయ్య, కోశాధికారిగా నల్ల శ్రీనివాస్, కాలువ రాజేశ్, ఎస్కే మహబూబ్, దాసరి లింగయ్య 9 మంది కమిటీ సభ్యులు 19 మంది కార్యవర్గంతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేశ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 13న జరిగే జిల్లా మహాసభను వేలాది మంది కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాడి గట్టయ్య, నియోజకవర్గ కార్యదర్శి కొంకుల రాజేశ్, దాగం రాజలింగు, గట్టు సర్వేశం, దుర్గం పోశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆవునూరి రాజు, అధ్యక్షుడు రామగిరి వెంకన్న, ఉపాధ్యక్షుడు లింగంపల్లి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 1: యువత, విద్యార్థులు బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్‌లు, ఐపీఎల్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌కు బానిసలుగా మారి, అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటునారన్నారు. ఇలాంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్ నిర్వహించే వారిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బెట్టింగ్ సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, ఇన్ఫర్మేషన్ అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

చింతలమానేపల్లి, ఏప్రిల్ 1 : చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి ఓ టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కౌటాల మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో గల కంకర క్రషర్ నుంచి మహారాష్ట్రకు కంకర లోడుతో వెళ్తున్న క్రమంలో టిప్పర్ రహదారిపై అదుపుతప్పి బోల్తా కొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డట్లు సమాచారం. నిత్యం పదుల సంఖ్యలో రాత్రి పగలు ఈ టిప్పర్లు రహదారి గుండా అధిక లోడ్‌తో మహారాష్ట్రకు కంకర రవాణా చేస్తుంటాయి. అధికలోడ్లతో వెళ్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

జైపూర్, ఏప్రిల్ 1: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవ్వరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎటువంటి ఇష్యూల్లో తలదూర్చవద్దని సూచించారు. ఇక్కడ సీఐ వేణుచందర్, జైపూర్, భీమారం ఎస్ఐలు శ్రీధర్, నాగరాజు, శ్వేతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

జన్నారం, ఏప్రిల్ 1 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని మండల కేంద్రంలోని పొనకల్ జీసీసీ నిత్యావసర వస్తువుల పంపిణీ దుకాణంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సన్నబియ్యాన్ని పంపిణీ చేసి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ముజఫర్‌అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికుడికి సన్మానం

విరమణ కార్మికుడిని సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5వ గనిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సురేందర్‌ను గనిపై టీబీజీకేఎస్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్ శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం కార్మికుడి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం రవికుమార్, గోవిందులు, రమేశ్, జాడి శ్రీనివాస్, సెగ్యం వెంకటేశ్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సభ్యుల ధర్నా

లక్షెట్టిపేట, ఏప్రిల్ 1: మండలంలోని పాత కొమ్ముగూడెంలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ, వీవో సమావేశం నిర్వహించడం లేదని, వివిధ సంఘాలకు సంబంధించిన లావాదేవీల వివరాలు తెలపడం లేదని పేర్కొన్నారు. సమావేశం నిర్వహించకపోవడంతో లావాదేవీలపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయని తెలిపారు. సంఘ సభ్యులందరూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హెల్ప్‌డెస్క్‌ను సందర్శించిన కలెక్టర్

జైపూర్, ఏప్రిల్ 1: మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను మంగళవారం కలెక్టర్ కుమార్‌దీపక్ సందర్శించారు. ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు తదితరులున్నారు.

అర్హులకు సన్న బియ్యం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం అందించడం జరుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి మంగళవారం ఆయన అర్హులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఇక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు.

కేంద్రం పెన్షన్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1: కేంద్ర ప్రభుత్వం పెన్షన్ సవరణ బిల్లు వెంటనే ఉపసంహరించుకోవాలని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లోక్ సభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించుకోవడం జరిగిందని, ఆ బిల్లు రాజ్యసభలో ఆమోదమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షనర్లు, ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు.

రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తులు స్వీకరణ

కాగజ్‌నగర్, ఎప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నా అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆ పత్రాలు అందించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, ఏప్రిల్ 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అల్లుడి వేధింపులతో మామ ఆత్మహత్య

లక్షెట్టిపేట, ఏప్రిల్ 1 : వరుసకు అల్లుడైన వ్యక్తి మామతో తరచూ గొడవపడుతూ బూతులు తిడుతుండడంతో మనస్తాపానికి గురైన మామ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం, లక్షెట్టిపేట మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన గడికొప్పుల రామయ్య (65)ను వరుసకు అల్లుడయిన కొట్టే సత్తయ్య కొంత కాలంగా గొడవపడుతూ ఇబ్బంది పెడుతున్నాడు. రామయ్యను గ్రామంలో కనిపించిన చోట కోపంగా చూస్తూ బూతులు తిడుతూ ఎందుకు బతుకుతున్నావ్ చావుపో అని అనేవాడన్నారు. అతడి వేధింపులు తట్టుకోలేక ఇంట్లో ఉరి వేసుకొని చనియాడని తెలిపారు. రామయ్య కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు కొట్టే సత్తయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లాభాల్లోనే శ్రీరాంపూర్ ఏరియా

- శ్రీరాంపూర్ వార్షిక ఉత్పత్తి 92 శాతం ఉత్పత్తి
- జీఎం శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియాలో 2024-25లో గనులు డిపార్ట్‌మెంటుల్లో 92 శాతం ఉత్పత్తి సాధించినప్పటికీ శ్రీరాంపూర్ ఏరియా లాభాల్లోనే కొనసాగిందని జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం ఆఫీస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతుతూ, 2024-25లో శ్రీరాంపూర్ ఏరియా 92 శాతం ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు. భూగర్భ గనుల్లో 90 శాతం, ఓసీపీల్లో 66 శాతం ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6, ఆర్కే న్యూటెక్, శ్రీరాంపూర్ ఓసీపీల్లో మాత్రమే వంద శాతం ఉత్పత్తి అధిగమించడం జరిగిందన్నారు. మార్చి నెలలో శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి 147 శాతం సాధించామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు 2015-26 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం 54.2 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యమని వివరించారు. సింగరేణిలో గడిచిన 2024-25లో 96 శాతం బొగ్గు ఉత్పతి సాధించడం జరిగిందన్నారు. రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఏరియాకు 54.2 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్ణయించడం జరిగిందన్నారు. కార్మికులు అధికారుల సమిష్టి కృషితోనే ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, డీవైజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, పీఎం కాంతారావు పాల్గొన్నారు.

ఉత్పత్తిపై సమీక్షా సమావేశం

శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి ఉత్పాదకతపై జీఎం శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో గడిచిన ఆర్థిక సంవత్సరం 55.78 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. అధికారులతో జీఎం మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పతి సాధించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ భీభత్స, పీవో శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీవైజీఎం అరవిందరావు, డాక్టర్ రమేశ్, చిరంజీవులు, ఈఈ రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఆఫీస్‌లో మంగళవారం 2025-26 ఆర్థిక సంవత్సరం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో జీఎం శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఫైనాన్స్ భీభత్స ఆధ్వర్యంలో ఆర్థిక సంవత్సరం మొదటి రోజు లక్ష్మీ పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్ కొడుకు గ్రూప్-1కి ఎంపిక

అనిల్‌కుమార్

జన్నారం, ఏప్రిల్ 1 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నగురు హరిదాస్ భాగ్యలక్ష్మి చిన్న కుమారుడు అనిల్ కుమార్ ఆదివారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపియ్యాడు. అనిల్‌కుమార్ తండ్రి హరిదాస్ పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రూప్-1 ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనిల్‌కుమార్‌ను అభినందించారు.

తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్‌గౌడ్

చంద్రమోహన్‌గౌడ్

నస్పూర్, ఏప్రిల్ 1 : తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉదారి చంద్రమోహన్ గౌడ్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ క్లేరియన్‌లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 20 మంది ఓటర్లు పాల్గొనగా చంద్రమోహన్‌గౌడ్ 20/20 ఓట్ల మెజార్టీతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గెలుపొందారు. రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీగా సుకుమార్ ఫ్రాన్సిన్ గెలుపొందారు. బాస్కెట్‌బాల్ గేట్ అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల అర్బన్ ఏప్రిల్ 1: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తిలక్ నగర్ ఏరియాను పరిశీలించి, అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, శాంతి భద్రతల విషయంలో ఇక్కడి పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తిస్తున్నారని, ఈ ఏరియాలో రకరకాల సమస్యలు ఉన్నాయని వాటిని అదుపు చేయడానికి కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ రత్నపురం ప్రకాశ్, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

నేడు మామిడి, సరుగుడు చెట్ల బహిరంగ వేలం

బెల్లంపల్లి, ఏప్రిల్ 1: మండలంలోని కన్నాల గ్రామ ఉద్యానవన నర్సరీలో మామిడితోట, సరుగుడు చెట్ల బహిరంగ వేలం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానవన అధికారి సుప్రజ తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు సరుగుడు చెట్లకు రూ.ఐదు వేలు, మామిడి చెట్లకు రూ.వెయ్యి ధరావత్తు ముందస్తుగా చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 8977713955 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

గౌతమేశ్వర కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 1: మంచిర్యాల పట్టణంలోని కాలేజీరోడ్‌లో ఉన్న గౌతమేశ్వర కాలనీ నూతన కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు లక్కాకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు ఉస్కమల్ల చందుపటేల్ ఎన్నికయ్యారని ఎన్నికల నిర్వాహకులు రాజగోపాల్, వరప్రసాద్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా స్వామి, వెంకటేశ్, గౌరవాధ్యక్షుడిగా కార్తీక్‌శర్మ, సలహాదారులుగా సమ్మిరెడ్డి, ధర్మయ్య, రామన్నపటేల్, సభ్యులుగా సురేందర్, సంతోష్‌గౌడ్, శంకర్, రమేశ్, తిరుపతి, రామకృష్ణ ఎన్నికయ్యారు.

వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల విరాళం

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 1: సామాజిక బాధ్యతలో భాగంగా మంచిర్యాలలోని శ్రీసాయి వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగులు ప్రతి నెలా రూ.20వేలు విరాళంగా అందజేస్తున్నారని విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ప్రతినెలా విద్యుత్ ఉద్యోగులు తమ జీతం నుంచి కొంత విరాళంగా అందిస్తున్నారన్నారు. ప్రతినెలా రూ.20వేలు శ్రీసాయి వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీ ఖాతాలో జమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 1 : చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల నష్టపరిహారం విధిస్తూ చెన్నూర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పీ రవి మంగళవారం తీర్పునిచ్చారు. చెన్నూర్ కోర్టులో మంగళవారం కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ చెక్ బౌన్స్ కేసుకు సంబంధించి సెక్షన్ 138 ఎన్ఐ యాక్ట్‌లో నేరం రుజువు కావడంతో బుద్దారం గ్రామానికి చెందిన ముద్దాయి ఆలం సత్తయ్యకు రెండేళ్ల జైలు శిక్ష, పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని చెన్నూర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

4న ఉచిత మెగా వైద్య శిబిరం

కాసిపేట, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో ఏప్రిల్ 4వ తేదీన ఉదయం 10 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానతోపాటు మెడిలైఫ్ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఫ్లెక్సీ తొలగింపుపై నిరసన

బెల్లంపల్లి, ఏప్రిల్ 1 : పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఫ్లెక్సీని మున్సిపల్ సిబ్బంది మంగళవారం తొలగించి వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఎండీ గౌస్ నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్ఐ రాకేశ్ చేరుకుని గౌస్‌ను సముదాయించడంతో ఆందోళన విరమించారు. తిరిగి ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమారం, ఏప్రిల్ 1 : దొంగతనాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కే శ్వేత సూచించారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో మంచిర్యాల జిల్లాలో పక్క రాష్ట్రాల నుంచి కొన్ని దొంగల ముఠాలు వచ్చాయని, ఇంట్లో నిద్రిస్తున్న సమయంలోనే దొంగతనాలు చేస్తున్నారని, పలు మండలాల్లో సంచరిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

రెబ్బెన, ఏప్రిల్ 1: నిరుద్యోగ యువతి, యువకులకు కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కూడా కల్పించటం జరుగుతుందని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు సికింద్రాబాద్‌లో ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. వివరాల కోసం కిమ్స్ ఫౌండేషన్ సెంటర్ 8019816641, 7287819562 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాపన్నగౌడ్ వర్ధంతిని జయప్రదం చేయండి

రెబ్బెన, ఏప్రిల్ 1: దళిత బహుజన విప్లవవీరుడు, మొగలు పాలకులను తరిమికొట్టిన యోధుడు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని విజయవంతం చేయాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా అధ్యక్షుడు కోండ్ర మనోహర్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఈనెల 2ననిర్వహించే కార్యక్రమానికి గౌడ సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నిర్బంధ పాలన

కాసిపేట, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన కొనసాగిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. మంగళవారం సోమగూడెంలో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.